# పుత్రుడు

పేరుకు హరికథా పితామహుడేగానీ ఇల్లు గడవటమే కష్టంగా వుంది. ఈ రోజుల్లో హరికథలు బుర్రకథలు చెప్పేవారెవరు? వినేవారెవరు? ఫ్రీగా 'సీతాకళ్యాణం' హరికథ చెప్పాను మొర్రో అంటే ఓ.సీ. వినే భక్తులే కరువైనారాయె!. అంతా ప్రసాదభక్తులు! వెల పదిరూపాయలైనా భక్తిశ్రద్ధలతో దేవుడికి సింపుల్‌గ టెంకాయకొట్టేసి నమస్కారం పెట్టి మనసులో కోర్కెలు విన్నవించుకోటమేనాయె!

అసలు దేవుడనేవాడే లేకుంటే మనుష్యుల మనసుల్లో భక్తికి చోటెక్కడిది? రాతి విగ్రహాన్ని చూచైనా గుడికెళ్ళి అందరూ కాకపోయినా కొందరైనా దేవుడ్ని దర్శించుకోవాలే దుగ్ధతో చూచి నమస్కరించి అప్పుడప్పుడు సాష్టాంగపడి కష్టాలు తీర్చమంటూ వేడుకుంటున్నారు. భగవంతుడు భక్తుల సింపుల్ భక్తికే మురిసిపోతున్నాడు. ఎక్కడో వైకుంఠంలో శేషసాయిపై పరుండి యోగనిద్రలో వుండే ఆ శ్రీమన్నారాయణుడికి భూలోకవాసుల మొరలు చెవులోపడటంలేదు. అందుక్కారణం ఇయర్‌ఫోన్ రెండు చెవుల్లో దూర్చి పాప్‌మ్యూజిక్కో తెలుగు అశ్లీల సాహిత్యంతో కూడిన ద్వంద్వార్థాల సినీమా పాటలో వింటూ బిజీగా వుండి వుండాలి? లేకపోతే మన ప్రార్థనలు ఆయన చెవిన ఎందుకు పడవు?

ఏమండీ... ఇంట్లో అన్ని నిండుకున్నయ్. మీరు కూరో నారో తెచ్చి పడేస్తేనే ఏదైనా! ఓ కేజీ బియ్యం కాకపోతే చౌకగా మార్కెట్లో దొరికే నూకలైనా తెండి. లేకపోతే పూటగడవటం కష్టం...' కామేశ్వరమ్మ భర్తకు విన్నవించింది.

'పోన్లే పస్తులుందాం! మనకిదేం కొత్త కనుకనా?' నిట్టూర్చాడు శాస్త్రిగారు.

శాస్త్రిగారంటే అందరికీ ఎంతటి గౌరవభావమున్నా నిత్యం చచ్చేవాడికి ఏడ్చేవాడెవడన్నట్లు... రోజూ దేహీ అని అడుక్కునే వాడికి ముష్టెవరేస్తారు?. అప్పటికే కాదనకుండా కొందరు దాతలు సహాయపడుతూండటం వల్లే ఈ మాత్రంగానైనా వుండగలిగాడు!. మరికొందరి దగ్గర చెయ్యిచాచి నోరుతెరిచి అప్పు చెయ్యాల్సివచ్చింది. అప్పులు పెరిగి పెరిగి హిమాలయాలంత అయినయ్. చేసిన అప్పు తీరిస్తే కదా... మళ్ళీ అడగటానికైనా... ఇచ్చేవాళ్ళు ఇవ్వటానికైనా!

ఇంట్లో వేన్న పాత సామానంతా ఒక్కొక్కటిగా అమ్మేసి అవసరాలు తీర్చుకుంటూరాగా...

ఇప్పుడవీ లేవు కొంపలో...

X X X

శాస్త్రి గారికి లేకలేక ఒక్కొగానొక్క నలుసు కలిగేడు. ఎన్ని నోములు నోచి... వ్రతాలు చేసి పుణ్యతీర్థాలు సేవిస్తే ఆ వక్కడైనా కడుపున పడ్డాడు.

పది కాన్పుల్లో... నాలుగు సార్లు అబార్షనవటం... అయిదుగురు పుట్టినా పెరిగే యోగం లేక నెల్లోపలే పోవటం జరిగేక... ఇంత తమకు సంతానయోగం లేదేమోని అఘోరిస్తుండగ...

ఆ దేవుడు కనికరించి పదో కాన్పుకి ఒక మగబిడ్డను ప్రసాదించాడు. తమ జన్మ ధన్యమైందని

సంబరపడ్డారు. వంశోద్ధారకుడు పుట్టినందుకు అపరిమితమైన ఆనందాన్ని పొందేరా దంపతులు!.

కొడుకు భాస్కరశాస్త్రి తెలివితేటలు చూస్తూ 'వీడికి వేదం చెప్పించాలే...' మనసులో మాట భార్యతో చెప్పాడు.

'నాకు మాత్రం పిల్లవాడికి ఇంగ్లీషు చదువు చెప్పించాలని కోరికగా వుందడీ!. ఎంచక్కా... భాస్కరుడిని కాన్వెంట్‌కు పంపి చదివించి కలక్టర్‌ను చేద్దా... ఏమంటారు?' - చాటలో వున్న బియ్యలో రాళ్ళేరుతూ మొగుడితో అంది కామేశ్వరమ్మ.

'అదీ నిజమే! ఈరోజుల్లో పౌరోహిత్యం... వేదాధ్యయనం... నాలాగ హరికధలు చెప్పుకుని పొట్టపోసుకోవటం రానురాను సన్నగిల్లుతోంది! వీటికి ఆదరణ క్షీణిస్తోంది. అంచేత మన సన్నాసిని బాగా చదివిద్దాం! నేనూ వయసులో వున్నానా... ఆర్జనకేం కొదువలేదు...' హుషారుగా మాట్లాడేడు శాస్త్రిగారు.

'మన పరిస్థితీ ఇప్పుడు నిక్షేపంగా వుందాయె! హరికధలతో మీకొచ్చే ఆదాయంతో నాలుగు గదుల ఇల్లు ఏర్పరచుకొంటిమి. కాస్తో కూస్తో దాచుకుంటిమి. నావంటిన పాతికశవర్ల బంగారు నగలుండె! మనకేం తక్కువని? - ప్లివాడిని చదివించి ప్రయోజకుడిని చేద్దాం!... మరోసారి నొక్కి మరీ చెప్పింది భర్తకు.

'నాకూ డిమాండ్ బాగుందోయ్! అవకాశమున్నప్పుడే నాలుగు రాళ్ళు వెనకేసుకోవాలి. మన అవసరాలు తీర్చుకంటూ భాస్కరుడ్ని ఎక్కదీసుకురావాలి!... కాన్వెంట్ యూనిఫామ్‌లో మనవాడు బాలభాస్కరుడిలా ధగద్ధగాయమానంగ వెలిగిపోతుంటే చూచేందుకు మనకు రెండు కళ్ళూ చాలవే...' కొడుకు భవిత వూహించుకుంటూ హుషారుగా మాట్లాడేడు శాస్త్రిగారు.

'మనవాడిని ఇంజనీరును చెయ్యాలండీ' అంత పెద్ద చదువుకు ఎంత ఖర్చవుతుదో?-'

'అలాంటి చదువులు చాలా ఖరీదైనవి. మనశక్తికి మించినవే! నాకు తెల్సి ఇం.నీరింగ్ చెప్పించాలంటే ఖర్చు లక్షల్లో వుంటుంది... అంత పెద్ద చదువు చెప్పించటం వనవల్ల అవుతుందని నేననుకోను...'

'ఒక్కగానొక్క మగనలుసు! మనకున్నదంతా తెగనమ్మి అయినా వాడిని ఇంజనీర్‌ను చెయ్యాల్సిందే తప్పదు. మన వంశంలో చదువుకున్నవారే అంతంత మాత్రం! అందునా డాక్టరు... ఇంజనీర్లు అయిన వాళ్లెవరూ లేరుకదా... మన భాస్కరుడు ఇంజనీరైతే... మంచి కట్నాలు ఇస్తామంటూ గొప్ప గొప్ప సంబంధాలొస్తాయండీ... వాడు సంపాదనపరుడైతే మనలను నెత్తినపెట్టుకుంటాడండీ... మనమంటే వాడికెంత ప్రేమ అనుకున్నారూ?...' మురుస్తూ భర్తతో మాట్లుడుతోంది కామేశ్వరమ్మ.

'మనం పిల్ల గురించి ఎన్నెన్నో వూహించుకుంటాం!. ఆ యోగ్యత కడుపున పుట్టిన వాళ్ళకి... అనుభవించే రాత మనముఖాన వుండొద్దూ!... ఏదిఏమైనా మగబిడ్డనిచ్చి భగవంతుడు వంశం నిలబెట్టాడు. వీడు లేకపోతే మన వంశం నిర్వంశం అయ్యేది. మనకు తలకొరివి పెట్టేవాడు...

ఏటా తద్దినాలు పెట్టేవాడూ లేకుండా పోయేవాళ్లం. దిక్కులేని అనాదశవాల్లాగ మున్సిపాలిటీ వారే ఈడ్చుకెళ్లి తగలేసే గతి పట్టకుండా చేశాడా దేవుడు... మనం అదృష్టవంతులమే కాముడూ...!'

'అందుకే ఇప్పుడు నాకేదిగులూ లేదు...'

'విజయనగరం జమీందారీ వంశీకులు నాచేత వాళ్ల వూళ్లో హరికథ చెప్పించుకోవాలని ముచ్చటపడుతున్నట్టు కబురొచ్చింది. నన్నొకసారి రమ్మన్నారు... కాస్త ఘనంగానే ముట్టచెప్పవచ్చునుకుంటున్నాను!. రానుపోను రైలు ఛార్జీలు.. అక్కడ

వుండేందుకు వసతి... భోజన ఏర్పాట్లూ చేసి ఓ పదివేలదాకా ఇవ్వచ్చనుకుంటున్నాను. మరి నేను వెళ్లొస్తాను. తిరిగి రావటానికో పదిరోజులు పడుతుంది. నువ్వు, పిల్లవాడూ జాగ్రత్త!... మధ్యాహ్న రైలుకే ప్రయాణం...' అన్చెప్పి వీధిలోకి నడిచాడు శాస్త్రిగారు.

శాస్త్రిగారంటే అల్లాటప్పా వ్యక్తి కాదు. అనేక చోట్ల సత్కారాలు, బిరుదులు పొందినవారు. ఆయన ప్రతిభకు మెచ్చి బంగారు కంకణాలు... కాళ్ళకు గండపెండేరాలు తొడిగించుకున్న ఘనుడు. చిన్న చితగ కార్యక్రమాలకు రానని తెగేసి చేస్తాడు. శాస్త్రిగారి ఆదాయం ఆయనకు గల పేరు ప్రతిష్ఠలకు తగినట్టుగానే వుంటుంది!.

రోజులు మారుతున్న కొద్దీ హరికథలు చెప్పించుకునేవారి సంఖ్య... ఆదరణ తగ్గుతోంది. నెలకో ప్రోగ్రాం రావటం కూడా కష్టంగా వుంది.

కొడుకు ఫస్ట్ మార్కులతో చదువులో ఎక్కొచ్చి ఇంజనీరింగ్ ఫస్టియర్లో చేరాడు. భాస్కరశాస్త్రిని ఇంజనీరింగ్‌లో చేర్చటానికి ఇన్నేళ్ళు నిలవ చేసిన డబ్బులో సగానికి పైగా ఖర్చయింది.

'ఒరే భాస్కరం... నీ అయిదేళ్ళ చదువు పూర్తై నువ్వు పట్టా పుచ్చుకోవటానికి డబ్బెంత ఖర్చవుతుంది?-' నూట పదకొండోసారి తండ్రి ప్రశ్నించాడు.

'డాడీ ! నన్ను అడిగిందే అడిగి వేధించకు... నన్ను చదువుకోనీ...!

'ఒరే నాచిట్టి తండ్రీ ! నా కన్నవు కదూ... చెప్పరా బంగారూ...'

'ఏడాదికి లక్ష చొప్పున... మొత్తం ఫీజులకు... బుక్స్‌కు... నా గుడ్డలకు... స్కూటర్‌కయ్యే పెట్రోలు ఖర్చు స్కూటరు ఖరీదు... ఎట్సెట్రా... వెరసి అయిదు లక్షల దాకా కావచ్చు !... ఇంకా ఎక్కువే అవుతుంది...'

స్కూటర్ కావాలని కొడుకు అనటంతో శాస్త్రిగారు కంగుతిన్నారు.

'అదెంతవుతుందేమిటీ'?

'చాలా చౌక నాన్నగారూ... ఆఫ్టాల్ యాభైవేలు... ఇంజనీరింగ్ చదువుతూ సిటీ బస్‌లో కాలేజీకి వెళ్లాలంటే సిగ్గేస్తోంది. ఫ్రెండ్సందరికీ టూవీలర్స్ వున్నయ్. నాకు లేదని ఎగతాళి చేస్తున్నారు...'

ఇప్పుడెలా? కొడుకు కోరిక కాదన్లేడు !

ఇలా ఒక్కో కోరిక తీరుస్తూ పోతే... చదువు పూర్తి అయ్యేనాటికి తనపరిస్థితి సముద్రంలో మునిగిపోయిన టైటానిక్ షిప్ అవటం ఖాయం అనేసి మనసులో

గొణుక్కున్నాడు.

పెళ్లానిక్కూడా చెప్పకుండా చేతికున్న బంగారు కంకణం... తనకు బహుమానంగ వచ్చిన దాన్ని అమ్మేసి బోటా బోటీలుగ చేతికి అందిన యాభైవేల క్యాష్ తెచ్చి కొడుకు దోసిల్లోపోసి స్కూటర్ కొనుక్కోమని హుషారుగ భుజం తట్టాడు శాస్త్రిగారు.

'ఏమండీ'... మీ ముంజేతికుండే బంగారుకడియమేదీ...?' ఆశ్చర్యపోతూ ప్రశ్నించింది.

'కొడుకు స్కూటర్ కావాలన్నాడు. చేతిలో డబ్బు లేదు. దాన్ని అమ్మేసి వాడి కోరిక తీర్చి సంతోషించాను...'

ఇలా ఒక్కోటీ అమ్ముతూ పోతే వాడి చదువు పూర్తి అయ్యేనాటికి కొంప గండమయ్యేట్టుంది అనుకుంది. పోన్లే ఏం చేసినా మగనలుసు కోసమే కదా? వాడు ఇంజనీరై గొప్ప వుద్యోగస్తుడు కావటానికే కదానుకుంది మనసులో.

'మనవాడు కొండమీది కోతిని తెమ్మన్నా తెచ్చేట్టున్నారు మీరు.' 'వాడూ మీరూ కాళ్లు కడుక్కురండి... భోజనం వడ్డిస్తాను...' కామేశ్వరమ్మ వంటిట్లోకి నడిచింది.

ఓడలు బండ్లు కావటమంటే ఇదేనే... చూశావా! నీ కొడుకు ఇంజనీరు అవటానికి ఐస్‌క్రీమ్‌లో నీ వంటి నుండే నగలు... నాకున్న బంగారు బహుమానాలు... బ్యాంకులో వున్న క్యాషు అంతాక్షవరమైంది చూశావా...' దిగాలుపడి పెళ్లాంతో కొడుక్కి విన్పించకూడదని చెవిలో రహస్యం చెపిపనట్టు అన్నాడు.

'చివరికి ముచ్చటపడి కట్టించుకున్న ఇల్లు కూడా అమ్మేశాం కదండీ...'

'చవకరోజులు కావటాన... వచ్చిన తక్కువ డబ్బు బొటాబొటీలుగ వాడి అయిదేళ్ల చదువుకు సరిపెట్టగలిగాం !... కానీ... రేపనే రోజున మనకంటూ ఏమీ మిగల్లేదు... కాదుకాదు... మిగిల్చుకోలేదు చూశావా? -' శాస్త్రిగారి మాటల్లో బాధ ద్యోతకమైంది. కంటిలో నీరు సుళ్ళు తిరిగింది.

'సరేకానివ్వండి ! అంతాదైవేచ్ఛ ! మనముఖాన ఎలారాసివుంటే అలా జరుగుతుంది... దొడ్లోకి నడిచి బక్కెట్లో తడిపిన బట్టలకు సబ్బుపెట్టెటంలో నిమగ్నమైంది కామేశ్వరమ్మ.

'ఇదిగో వాచ్‌మెన్ ! ఎవరావచ్చింది?' మేడమీద బాల్కెనీలోంచి కేకేసి అడిగింది స్వాతి.

'మన అయ్యగారికి అయ్యగారు మేడమ్...'

'ఆయన వూళ్లో లేరు. పొమ్మను...'

'వెళ్లమంటున్నారండి...'

'లోనికి రానీడు... అవునూ ఆయనెందుకొచ్చారో కనుక్కో...'

'డబ్బులకోసంటండీ...'

'ఇక్కడేం కుప్పలు పోసుకోటల్లేదని చెప్పి పంపెయ్. వెళ్లకపోతే... రోడ్డుమీదికి ఈడ్చిపడెయ్...' అనేసి లోనికి నడిచింది స్వాతి.

'ఎల్లండి బాబూ అమ్మగారి గురించి మీకు తెల్సుగా? ఇచ్చి అయ్యగారిని కూడా ఇవ్వకుండా చేస్తుంది. లేకుంటే మీకు ఇన్ని కష్టాలెందుకొస్తయ్! - కొడుకే కదాని మీకున్నదంతా ఊడ్చిపెట్టారు. ఇప్పుడు చూడండి... కన్నకొడుకు దగ్గరే నెలనెలా అడుక్కోవలసివస్తోంది! రోజులు మారిపోయినయ్ బాబుగారూ!... పెళ్ళామొచ్చాక మగపిల్లకాలయల మనసే మారిపోద్ది!. కన్నవాళ్లంటే బిచ్చగాళ్ల కింద లెఖ అయినారు. ఎల్లండి బాబూ... ఎల్లిపోండి... నాలుగేళ్లుగ శాస్త్రిగారికి తిండికి గతిలేక బిచ్చమెత్తుకునే వాడిగ ఇంటిచుట్టూ తిరుగుతూ ఛీ కొట్టించుకోవటం కళ్లారా చూస్తూ వుండటాన చనువుతో చొరవతో అభిమానం పుట్టిపడేలా మాట్లాడాడు.

ఇల్లు చేరుకున్న శాస్త్రిగారిని 'ఏమండీ... అబ్బాయి డబ్బేమైనా ఇచ్చాడా? ఎంతిచ్చాడు?... ఇస్తే నెలసరుకులు తేకపోయారా?-' గడగడా ఆత్రంగా అంది కామేశ్వరమ్మ.

'హు ! ఏం చెప్పను ? ఇంట్లోవుండీ కోడలిచేత లేదన్పించాడు. ఇది ఎప్పుడూ వున్న భాగోతమేగా... కాస్త మంచి తీర్థం ఇవ్వు... గొంతు తడి ఆరిపోతోంది...' నేలమీద కూలబడ్డాడు.

భార్య ఇచ్చిన మంచితీర్థం తాగి దప్పిక తీర్చుకుని 'తల్లిదండ్రుల యందు దయలేని పుత్రుడు పుట్టనేమి.. గిట్టనేమి అంటూ పద్యం వేమన ఏనాడో రాశాడే ! మన తలరాత ఆ దేవుడు సైతం తప్పించలేడే...'

--- సమాప్తం ---